పోలీసుల చర్యపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రజా సమస్యలపై పోరాడే వారికి ఎలాంటి నిర్బంధాలు ఉండవని మంత్రి నారా లోకేష్ ప్రకటించినప్పటికీ పోలీసులు పాత పద్ధతుల్ని అనుసరించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. గరుగుబిల్లి మండలం శివ్వాంలో దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, భూ సమస్యలు పరిష్కరించాలని 34 రోజులుగా కలెక్టరేట్ వద్ద రిలేనిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు నేటికీ స్పందించలేదన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలనే ఉద్దేశంతో సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిస్తే, దీన్ని భగ్నం చేయాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులకు ముందస్తు నోటీసులు ఇవ్వడం దారుణమని అన్నారు. పోలీసులు ప్రజా సమస్యలపై పోరాడే వారిపట్ల ఇలా నిర్బంధాల విధిస్తే ఊరుకునేది లేదని, కచ్చితంగా సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు.

ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొరడ, ఆర్ జమ్ము, కొండబరిడి, వలసబల్లేరు గ్రామాల్లో ఆదివారం కలెక్టర్ పర్యటించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తీరును తెలుసుకున్నారు. గొరడ, ఆర్ జమ్ములో కలెక్టర్‌కు స్థానికులు సాంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికులతో ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయం పట్ల ఆసక్తి గల కలెక్టం రైతులతో కలిసి నాట్లు వేశారు. జీవామృతం వంటి ప్రకృతి ఎరువుల తయారీలోనూ చేయి కలిపారు. వ్యవసాయం చేయాలనే కోరిక ఈ రోజు నెరవేరిందని ఆయన చెప్పారు. రైతులు తమతో జిల్లా కలెక్టర్ ఊబాలు వేయడం సంతోషించారు. కొండబారిడి, వలసబల్లేరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో వారి అనుభవాలపై స్వయం సహాయక బృందాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ సహజ వ్యవసాయం వల్ల పంటలకు అదనపు విలువ పెరుగుతుందని, సహజ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రజలు మంచి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. సహజ వ్యవసాయ ఉత్పత్తులకు మంచి మార్కెట్ ఉందని, జిల్లాలో సహజ వ్యవసాయానికి అన్ని అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గిరిజన రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉంటారన్నారు. జిల్లాలో సహజ వ్యవసాయాన్ని సులభంగా చేపట్టవచ్చని, ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పూర్తి ప్రకృతి వ్యవసాయం చేయడం జరుగుతుందని చెప్పారు. రైతులు ఇదే రంగంలో ఉన్నందున చిన్న జోక్యంతో అద్భుతాలు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా మార్కెటింగ్ అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని అవకాశాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో రోజువారీ పోకడలను తెలుసుకోవాలని, తదనుగుణంగా కార్యక్రమాలు చేపట్టవచ్చని సూచించారు. సేంద్రియ పసుపు, ముల్లంగి, చింతపండు, కొండచీపుర్లు మొదలైనవి మన జిల్లాకు సహజ సిద్ధ సంపద అని, వాటిపై మనం దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం, జీవామృతాల తయారీ నేర్పిన రైతులకు ముఖ్యంగా మహిళా రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయమే లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. దాదాపు 49 వేల మంది రైతులు ఇందులో ఉన్నారని ఆ సంఖ్యను 75 వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ - ప్రకతి వ్యవసాయకులు డి.పారి నాయుడు, ప్రకతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షన్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

నాట్లు వేసిన కలెక్టర్

గొరడలో రైతులతో కలిసి నాట్లు వేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కోల్‌కత్తాలోని జూనియర్ డాక్టర్‌ను అతిపాశవికంగా హింసించి ఆపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా కేంద్రాసుపత్రి కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో నిర్భయ, హైదరాబాదులో దిశా, నేడు కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారాలు ఎన్ని జరిగినా దుండగులపై కఠిన చర్యలు తీసుకుపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని అన్నారు. పని చేసే చోట మహిళా ఉద్యోగులకు, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో రానున్న కాలంలో ఇటువంటి సంఘటనలు ఎక్కడా జరగకుండా ఉండాలంటే నిందితులను వెంటనే పట్టుకొని ఉరితీయాలని మహిళా విభాగం నాయకులు రూపా, దేవిశ్రీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.మురళి, మండల నాయకులు టి.శ్రీను, పోలినాయుడు మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : కోల్‌కత్తాలోని జూనియర్ డాక్టర్‌ను హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండలంలోని తోణాం పరిధిలో గల మెట్టవలస గ్రామ యువత ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తోణాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ సమాజంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందిస్తున్న వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనలు జరగకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ యువత, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : కోల్‌కత్తాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం చాలా హేయమైన చర్య అని, ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని ఎంఇఒ- 1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం అధివారం నాడు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజలకు సేవ చేసి ప్రాణాలను కాపాడే మహిళా వైద్యురాలిని అతి కిరాతకంగా అత్యాచారం చేసి, హత్య చేయడం చాలా హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇటువంటి ఆలోచన చేయాలంటేనే భయపడేలా నిందితులకు అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన

నిరసనలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు

నిరసనలో మాట్లాడుతున్న తోణాం పిహెచ్‌సి వైద్యాధికారి సుజాత

జిల్లా ఎస్‌పిల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ డిఐజి గోపీనాథ్

గంజాయి నిర్మూలనకు వంద రోజుల కార్యాచరణ

ప్రజాశక్తి-విజయనగరం

విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో గంజాయి నిర్మూలనకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుకు చేస్తున్నట్లు డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. విశాఖ రేంజ్ పోలీసు కార్యాలయంలో ఐదు జిల్లాల్లోని ఎస్‌పిలతో డిఐజి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు రేంజ్ పరిధిలో జిల్లా ఎస్‌పిలు గంజాయి నియంత్రణకు చేపట్టిన చర్యలు, పురోగతి, పరిణామాలు, భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. గంజాయి అక్రమ రవాణాకు వినియోగిస్తున్న అన్ని మార్గాలపై నిఘా కొనసాగించాలని, కీలక నేరస్తులపై అనుమానిత షీట్లు తెరవాలని డిఐజి సూచించారు. ఈ ఏడాదిలో రూ.4.75 కోట్ల విలువ చేసిన 9,517 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, 545 మందిపై 223 కేసులు నమోదు చేశామని తెలిపారు. గంజాయి రవాణాకు సహకరించిన వారిని కూడా ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చి, అరెస్టులు చేయాలని ఎస్‌పిలను ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం ఎస్‌పి వకుల్ జిందాల్, అనకాపల్లి ఎస్‌పి దీపిక, శ్రీకాకుళం ఎస్‌పి మహేశ్వర రెడ్డి, పార్వతీపురం మన్యం ఎస్‌పి మాధవ్ రెడ్డి, అల్లూరి సీతారామరాజు ఎస్‌పి అమిత్ బర్దర్, ఎన్‌డిపిఎస్. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోవిందరావు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలను బలిగొంటున్న చినగొడబ క్వారీ లైసెన్స్ రద్దుచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజల ప్రాణాలను బలికొంటున్న క్వారీ పనులకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం అమానుషమని, అదో క్వారీ సామ్రాజ్యమని, ప్రభుత్వ శాఖల వెన్నుదన్నులతోనే తిరుగులేని శక్తిగా ఎదిగి, అక్రమాలకు పాల్పడుతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. చినగుడబలో అక్రమంగా క్వారీ చేపడుతున్న పనులను నిలిపివేయాలని, లైసెన్సు రద్దు చేయాలని కోరుతూ చిన్నగొడబ కొండ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన గోడపత్రికను, కమిటీ నాయకులతో కలిసి ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో విడుదల చేశారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ గరుగుబిల్లి మండలం చినగుడబ కొండపై మైనింగ్ స్టోన్ క్రషర్ క్వారీ యజమాని సామ్రాజ్యాన్నే సృష్టించి ప్రభుత్వ భూమి ఆక్రమించేశారని, చెరువులను, బందను కప్పేశారని తెలిపారు. ఈ అక్రమ క్వారీ ఫలితంగా 150 ఎకరాల భూమిలో పంట పండదని, రాళ్ల క్రసింగ్ వల్ల వచ్చిన ధూళి గాలి వల్ల పంట భూముల్లో పడి భూమి గట్టిపడిపోయిందని, గెడ్డలు కప్పేయడంతో కొండ నుంచి నీరు రాక నెల్లివాని చెరువు, ఒడుగులవాని చెరువు, ఎన్నివాని చెరువులు బీళ్లైపోయాయని అన్నారు. భారీ డైనమైట్ల వల్ల ఇళ్ల గోడలు పగిలిపోతున్నాయని, గడబవలస, పెదగడబ గ్రామాలపై రాళ్ళు ఎగిరిపడుతున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు బిక్కు బిక్కు మని బతుకుతున్నారని వాపోయారు. ఆ క్వారీ సామ్రాజ్యంలోకి పశువులు, గొర్రెలు మేకలు మేతకు పోకుండా, మనుషులకు కూడా ప్రవేశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. క్వారీ నుండి వెలువడిన ధూళి మింగడంతో పెదగుడబ, గదబవలస ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, ఇప్పటికే ఇద్దరు కిడ్నీ వ్యాధితో చనిపోయారని, ఎంతో మంది మంచం పట్టి ఉన్నారని తెలిపారు. ఈ రోజుకు గదబవలసలో 50మంది వరకు గుర్తుపట్టని వ్యాధితో బాధపడుతున్నారని, కనీసం వైద్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించేసినా రెవెన్యూ అధికారులకు పట్టడడంలేదని, చెరువులు, గెడ్డలు, కప్పేసినా పంచాయితీరాజ్ అధికార్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 300 మీటర్ల లోపు క్వారీ క్రషర్ ఉన్నా, క్రషర్ నుంచి విడుదలైన దుమ్ము, ధూళి ప్రజలపైకి ఒదిలేసినా పర్యావరణ అధికార్లు తెలియనట్లే నటిస్తారని, జంఝావతి కాలువ కప్పేసి రోడ్డు వేసేసినా, నాగావళి కాలువ నీరు అక్రమంగా తోడేసినా, జంఝావతి, నాగావళి కాలువలపై భారీ యంత్రాలు తిప్పేసినా ఇరిగేషన్ అధికార్లు మాది కాదన్నట్లు నటించడమంటే అంతకన్నా దౌర్భాగ్యం మరొకటి లేదని అన్నారు. జనాన్ని కొట్టినా, ఇంకెన్ని దారుణాలు జరిగినా పోలీసులు స్పందించడం లేదని, క్వారీ సామ్రాజ్యాధిపతి ఫిర్యాదు ఇవ్వగానే పోలీసులు అక్రమ కేసులు ప్రజలపై పెట్టేస్తుండడం, క్వారీకి ఒత్తాసుగా రెవెన్యూ అధికారులు క్షణాల్లో వస్తుండడం చూస్తుంటే వీళ్లక్వారీ యజమాని మనుషులని ఎవరికైనా అనుమానం కలగక మానదా అని అన్నారు. పబ్లిక్ హియిరింగ్ (ప్రజాభిప్రాయ సేకరణ)లో ప్రజలంతా ముక్తకంఠంతో ఒద్దన్నా క్వారీకి అనుమతులు ప్రభుత్వం ఇచ్చిందని, చట్టాలు ప్రభుత్వాలు దోపిడీదారుల చుట్టాలుగా నిలుస్తున్న వేళ, భయపడితే ప్రజల బతుకు బుగ్గిపాలేనని అన్నారు. ప్రతిఘటనే పరిష్కారమన్నారు. మన భూమి మనకు ఉపయోగపడాలన్నా, మన చెరువులు మనకు దక్కాలన్నా, కొండ నీరు మనకు రావాలన్నా, కొండపైకి మనం వెళ్లాలన్నా, మేకలు మేతకు పోవాలన్నా, రోగాలు రోస్టులు నుంచి మనం బయట పడాలన్నా క్వారీయింగ్ చేయకుండా ఆపేయడమే పరిష్కారమని, జనం ప్రాణాలతో చలగాటమాడుతున్న క్వారీ యజమానిని అరెస్టు చేయాలని, ఈ అక్రమ క్వారీకి వత్తాసు పలుకుతున్న సంబంధిత శాఖ అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు దుప్పాడ రాజేష్ కుమార్, పోలురోతూ చంద్రశేఖర్రావు, బెజవాడ మహేశ్వరరావు, కందిస అఖిల్, కందిస వంశీకృష్ణ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్నగొడబ కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

సీతంపేటలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఉబాలు ముమ్మరంగా ప్రారంభమయ్యాఇ. అయితే ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కాసినప్పటికీ 6 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం రైతులకు ఎంతో అవసరం ఊరటనిచ్చింది. ఆగస్టు నెలాఖరైనప్పటికీ ఉడుపులు ప్రారంభం కాలేదు. ఈ వర్షంతో ఉడుపులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

మన్యంలోకి ప్రవేశించిన గజరాజులు

ప్రజాశక్తి-వంగర

ఈ నెల 11న వంగర మండలంలోని వివిఆర్‌పేటలోకి ప్రవేశించి, పంటలను నాశనం చేసి, రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన గజరాజులు ఆదివారం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలోకి ప్రవేశించాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజుల పాటు ఇక్కడ తిష్టవేసిన ఏనుగుల గుంపు వివిఆర్‌పేట, రాజుల గుమ్మడ గ్రామాల్లో మొక్కజొన్న, చెరకు, పామాయిల్, వరి పంటలను ధ్వంసం చేశాయి. అధికారులు పంట నష్టం పరిశీలించి, పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

తరలివెళ్లిపోయిన గజరాజులు

జగన్నాథస్వామి ఆలయం వద్ద డంప్ చేసిన ఇసుక

ఈ ఇసుక ఎక్కడికి?

ప్రజాశక్తి - పాలకొండ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారు. ఇసుక అనాధికారంగా ఎవరు తవ్వినా చర్యలు తప్పవని ఉన్నత స్థాయి అధికారులు నుండే ఆదేశాలు వచ్చాయి. అయితే మండలంలోని గోపాలపురం, చిన్న మంగళాపురం, అన్నవరం ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరిగాయి. దీన్నిఈ ప్రభుత్వం వచ్చాక అడ్డుకట్టు వేశారు. అయితే అంపిలి, గోపాలపురం గ్రామాల నుండి నాటుబళ్లతో ఇసుకను జగన్నాథ స్వామి ఆలయం దగ్గరకు తరలించి పెద్దఎత్తున డంప్ చేస్తున్నారు. గత మూడు రోజుల నుండి ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అయితే ఈ ఇసుక ఎక్కడికి వెళ్తుంది, ఎవరు డంప్ చేస్తున్నారనేది తెలియాల్సి ఉంది. అధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టౌన్ సిఐగా అప్పలనాయుడు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ సిఐగా బి.అప్పలనాయుడును నియమిస్తూ డిఐజి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సిఐ వాసును అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డిపిఎస్ టాస్క్ ఫోర్స్‌కు బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికెవీధి సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా ఉన్న అప్పలనాయుడును టౌన్ సిఐగా నియమించారు. ఇప్పటికే రూరల్ సిఐగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

పార్వతీపురంరూరల్ : పట్టణ సిఐగా విధులు నిర్వహిస్తున్న పివివిఎస్ఎన్ కృష్ణారావు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆయన్ను విశాఖపట్నం విఆర్‌కు పంపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డిసిఆర్‌బి సిఐగా విధులు నిర్వహిస్తున్న ఓంపురి నారాయణరావుకు పార్వతీపురం టౌన్ సిఐగా బాధ్యతలు అప్పగించారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించడమే లక్ష్యం

జిల్లా 95వేల ఎకరాల్లో సాగు

జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజుతో 'ప్రజాశక్తి' ముఖాముఖి

జిల్లాలో వ్యవసాయదారులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి తద్వారా రసాయన ఎరువులను అరికట్టి భూసారాన్ని పెంచడమే కాకుండా సహజసిద్ధమైన ప్రకృతి వనరులను వినియోగించుకుని సేంద్రీయ పద్ధతులతో సాగు చేయడమే ధ్యేయమని జిల్లా ప్రకతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ పీ షణ్ముఖ రాజు తెలిపారు. ప్రకృతి సాగు వల్ల అధిక ఖర్చులను నివారించడమే కాకుండా పోషక విలువలు గల పంటలను, కూరగాయలను కూడా సాగు చేయవచ్చునన్నారు. ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయంపై ప్రజాశక్తి నిర్వహించిన 'ముఖాముఖి'లో ఆయన మాట్లాడారు. వివరాలిలా ఉన్నాయి.

- ప్రజాశక్తి, పార్వతీపురంరూరల్



☞ ప్రకృతి వ్యవసాయంపై జిల్లాలో ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు అవగాహన కల్పించారు?

సాంప్రదాయక పద్ధతులను అనుసరిస్తూ రైతులకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగిస్తూ ప్రకృతి వ్యవసాయంపై వారికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకు జిల్లాలోని 15 మండలాల్లో 75 వేల మంది రైతులను సభ్యులుగా చేర్పించి 95వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు వారిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆసక్తి గల 290 మంది రైతులను సిఆర్‌పిలుగా గుర్తించి వారికి 8 మంది మాస్టర్ ట్రైనీలచే శిక్షణ క్షేత్రస్థాయిలో ఇప్పిస్తున్నాం. అలాగే రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిని పెంచుకొని తమ పొలాల్లో వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

☞ రసాయనాలు లేకుండా భూసారాన్ని పెంచేందుకు చేపడుతున్న చర్యలు ఏమిటి ?

జిల్లాలో ప్రధానమైన వరి పంటకు 45 రోజుల ముందు నవధాన్యాలను వారి పొలాల్లో వేయించి, అవి పెరిగిన తర్వాత ఆ మొక్కలను కోసి పశువులకు మేతగాను ఉపయోగించడమే కాకుండా, నవధాన్యాల మొక్కలను పొలాల్లో కలియదున్నిస్తాం. అనంతరం వరి నాట్లు వేసుకోవడం ద్వారా భూ భూసారం పెరిగి, అధిక శాతంలో నత్రజని పంటకు అందడం ద్వారా ఎక్కువ దిగుబడులు పెరిగేందుకు ఉపయోగపడుతుంది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 50 వేల ఎకరాల్లో నవధాన్యాలను ప్రధాన పంటకు ముందుగా రైతులతో వేయించాం.

రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చేందుకు చేపడుతున్న చర్యలేమిటి?

జిల్లాలోని నీటి వనరులున్నప్పటికీ వాటిని రైతులు సక్రమంగా వినియోగించుకోకపోవడంతో ఆదాయాన్ని కోల్పోవడాన్ని గుర్తించాం. దీంతో ఎటిఎం పద్ధతి ద్వారా తక్కువ విస్తీర్ణంలో అంటే కనీసం 20 సెంట్లు ఉన్న భూమిలో పలు రకాల కాయగూరలను సేంద్రీయ పద్ధతిలో పండించడం అలవాటు చేస్తున్నాం. దీనివల్ల రైతులకు పోషక విలువలను గలిగిన ఆహార పదార్థాలను అందించడమే కాకుండా, మిగిలిన వాటిని మార్కెట్లో అమ్మడం ద్వారా వారికి అదనపు రాబడి కూడా వస్తుంది. దీంతో జిల్లాలో రైతులు ఎటిఎం పద్ధతిపై ఆసక్తిని కనబరుస్తున్నారు. దీన్ని ఈ ఏడాది జిల్లాలోని అన్ని మండలాల్లో విస్తరించడానికి సిఆర్‌పిల ద్వారా కృషి చేస్తున్నాం.

☞ కూరగాయల క్షేత్రాలను రైతులకే పరిమితం చేస్తున్నారా?

ఎటిఎం పద్ధతి అనుసరిస్తూ జిల్లాలోని కిచెన్ గార్డెన్స్ పేరిట అంగన్వాడీ కేంద్రాల్లోనూ, ప్రభుత్వ పాఠశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిం చేందుకు కూరగాయల పెంపకాలను ప్రోత్సహి స్తున్నాం. ప్రభుత్వం కూడా ఈ పద్ధతిపై సుముఖంగా ఉండడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో విస్తృతంగా కిచెన్ గార్డెన్స్‌ను నిర్వహిం చడానికి సంబంధిత బాధ్యులకు మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

☞ విత్తన సేకరణకు చేపడుతున్న చర్యలు ఏమిటి?

నవధాన్యాలు, ఎటిఎం, కిచెన్ గార్డెన్స్ నిర్వాహకులకు విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు జిల్లాలోని పలు రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా విత్తనాలను సేకరిస్తున్నాం. అంతేకాకుండా వాసన్, జట్టు, వెలుగు వంటి సంస్థల ద్వారా కూడా విత్తన సేకరణ చేపడుతున్నాం. వీటిని ఉచితంగా కాకుండా సరసమైన ధరలకే ఔత్సాహిక రైతులకు అందజేస్తున్నాం.

☞ పంటల్లో ఆశించే పురుగులు, చీడపీడల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

కూరగాయల పంటలను ఆశించే తెగుళ్లు, చీడ పీడల నివారణకు సహజసిద్ధంగా ప్రకృతి నుంచే లభించే ఆకుల ద్వారా కషాయాలను తయారు చేయించి రైతులకు అందజేయడం జరుగుతుంది. అంతేకాకుండా మొక్కలకు పోషకాలు అందించేందుకు, నివారణకు పలు రకాల కషాయాలను తయారు చేయడంపై వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. అలాగే రైతులతో తయారుచేసిన కషాయాలను అందించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వనరుల ఉత్పత్తి కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటుచేసి వాటి ద్వారా రైతులకు కషాయాలను, విత్తనాలను, వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నాం.

☞ జిల్లాలో ఎన్ని ప్రకృతి వనరుల కేంద్రాలు ఉన్నాయి?

జిల్లావ్యాప్తంగా 20,090 ప్రకృతి వనరుల కేంద్రాలను రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ సంబంధిత పర్యావరణహిత పురుగుల మందులు, బలవర్ధకమైన ఎరువులు అందించడం జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు రైతులకు ప్రత్యేకమైన గుర్తింపు పత్రాలను అందించి, వారిని ప్రోత్సహిస్తున్నాం.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

వరద నీరు వెళ్లేందుకు మూతపడ్డ దారులు
పట్టించుకోని పట్టణ ప్రణాళికా విభాగం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని గెడ్డలు, చెరువులు, బందలు ఉన్న ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను సంబంధిత యజమానులు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కానీ, ఆయా ప్రాంతాలకు సంబంధించిన వార్డు సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీ లు కానీ పట్టించుకోవడంలేదు. దీంతో భవన నిర్మాణ ప్లాన్‌లో ప్రభుత్వ రహదారి విస్తీర్ణం బట్టి కొన్ని అడుగులు మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసిన స్థలాలను కూడా కలిపి నిర్మాణదారులు భవన నిర్మాణాలను చేపడుతున్నారు. మరికొందరు కాలువలను, గోడ్డలను, బందలను, వరద నీరు వెళ్లే మార్గాలను కూడా ఆక్రమించి అపార్ట్‌మెంట్లు, భారీ నివాస గృహ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఈ ఆక్రమణలపై దృష్టి పెట్టి విచారణ జరపాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అయినా సంబంధిత అధికారులు దృష్టి పెట్టకుండా నిర్మాణం పూర్తి అయిన తర్వాత సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినబడుతూనే ఉన్నాయి.

ఈనెల 15న రాత్రి గంట పాటు కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు వీధులతో పాటు పట్టణ శివారులో ఉన్న పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్లపైనే వరద నీరు నిల్వ ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర, సిపిఎం నాయకులు ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించారు. మున్సిపల్ అధికారులు కూడా పరిశీలించి వెళ్లడంతో సరిపోతుంది కానీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సంబంధిత భవన యజమానులపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని బహిరంగం గాని విమర్శిస్తున్నారు. గంట, రెండు గంటలు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పట్టణంలో పలు ప్రాంతాలు ముంపునకు గురి అయితే, రెండు,మూడు రోజులు వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భారీ వర్షాలు కురవక ముందే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి ఆయా ప్రాంతాలు ముంపునకు గురవ్వకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపడితే మంచిదని స్థానికులు కోరుతున్నారు.

కురిసిన భారీ వర్షానికి అపార్ట్‌మెంట్ వద్ద నిల్వ ఉన్న వరద నీరు (ఫైల్)

బయటకు ప్రవహిస్తున్న బెలగాం శివారులో ఉన్న వరహాల గెడ్డలో వరద నీరు (ఫైల్)

మంత్రి సంధ్యారాణికి పెయింటింగ్ అందజేస్తున్న లావణ్య

గిరిజన జీవనంపై పెయింటింగ్ బహూకరణ

బాలికను అభినందించిన మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజనుల జీవన విధానం, కొండలు, గుట్టల గురించి తాను వేసిన పెయింటింగ్ చిత్రాలను నామాజు లావణ్య రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి బహూకరించారు. ఆదివారం లావణ్య మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి పెయింటింగ్ చిత్రాలను ప్రదర్శించారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాచి పెంట మండలం చిట్టెలు గిరిజన శిఖర గ్రామం వెళ్లి అక్కడి గిరిజనుల జీవన శైలి, ఆహార అలవాట్లు, కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం వంటి అంశాలపై లావణ్య పెయింటింగ్ చిత్రాలు వేశారు. తెలంగాణాలోని యాదాద్రి భువనగిరి నుంచి వచ్చిన లావణ్య పెయింటింగ్ పై మక్కువతో అనేక చిత్రాలను వేశారు. ఆమె వేసిన పెయింటింగ్స్‌ను చూసిన మంత్రి సంధ్యారాణి అభినందించారు.

సోలార్ పంపుసెట్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

సోలార్ విద్యుత్ పంపు సెట్లు రైతులకు ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ఆవేపేంద్ర, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరాడలో వారు విలేకరులతో మాట్లాడారు. రెండున్నర ఎకరాలు దాటిన ప్రతి రైతుకు గతంలో టిడిపి ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు ఎన్టీఆర్ జలసిరి కింద విద్యుత్ సోలార్ పంపు సెట్లకు సంబంధించి బోర్లు మంజూరు కాగా, 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వైయస్సార్ జలకల అని పేరు పెట్టి నియోజకవర్గానికి ఒక బోరు అని ఇష్టానుసారంగా చెప్పి ఎక్కడా ఒక్క బోరు తీసిన దాఖలాల్లేవన్నారు. గతంలో మండలంలో 272 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో 32 కాంట్రాక్టు పంపించినప్పటికీ ఎక్కడా ఒక్క బోరు కూడా తీయని పరిస్థితి ఉందని అన్నారు. రైతులను మోసగించిన వైసిపి ప్రభుత్వం ఓడిపోయిన తర్వాత మళ్లీ తిరిగి టిడిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినందున గతంలో మాదిరిగా విద్యుత్ సోలార్ పంపుసెట్లు రైతులకు మంజూరు చేసి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. లేకుంటే గత ప్రభుత్వానికి పట్టి గతే మీకు పడుతుందన్నారు.

విరాళాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

వయనాడ్ వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేటలో ఆదివారం కేరళలోని వయినాడ్ వరద బాధితులకు రైతు సంఘం ఆధ్వర్యంలో రూ.5180 విరాళాలు వసూలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు వరద బాధితులను మానవతా దృక్పథంలో ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామారావు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఆర్ రాము, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరేళ్లవలసలో మూతపడిన సచివాలయం

తెరుచుకోని సచివాలయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆంధ్రా - ఒడిస్సా వివాదాస్పద గ్రామాలకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అందించాలనే ఉద్దేశ్యంతో ఎపి ప్రభుత్వం గంజాయి భద్ర పంచాయతీకి ఇక్కడ నుండి వెళ్లి రావడానికి ఉద్యోగులు ఇబ్బందులు పడతారనే కారణంతో సారిక పంచాయతీ నేరెళ్లవలసలో సచివాలయం ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ సచివాలయం సిబ్బంది మాత్రం నెలలో సగం రోజులు మాత్రమే వస్తున్నారని, మిగతా రోజులు రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సచివాలయానికి ఏ పనులు నిమిత్తం వచ్చినా ఏ ఒక్కరూ అందుబాటులో లేకపోవడంతో ఎంతో వ్యవ ప్రయాసలతో వస్తున్న తమకు నిరాశే ఎదురవుతుందని గిరిశిఖర గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఇక్కడ సిబ్బందిని సచివాలయంలో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు .

తొలగించారు... వదిలేశారు...

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు పట్టణంలోని పలు చోట్ల విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. పట్టణంలోని 26వ వార్డు పరిధిలో గల టిఆర్ఎంఎం బాలికల ఉన్నత పాఠశాల, ఆడబడి వీధి, తెలుగు బ్రాహ్మణ వీధి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల దగ్గరలో ఉన్న, విద్యుత్ స్తంభాలకు వర్షం కురిసిన సమయాల్లో ఈదురు గాలులు వీచేటప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రధాన విద్యుత్ తీగలకు దగ్గరగా ఉన్న చెట్లను విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం తొలగించి వదిలివేశారు. దీంతో ఆ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఈ మూడు పాఠశాలలకు పని దినాలు కావడంతో విద్యార్థులు తమ సైకిళ్లను పార్కింగ్ చేసుకునేందుకు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇటు విద్యుత్ శాఖ అధికారులు గాని ఇటు మునిసిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు గాని తొలగించిన చెట్లను తరలించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల సమీపాన రోడ్డుపైనే విద్యుత్‌శాఖ విడిచిపెట్టిన చెట్ల కొమ్మలు

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు కోరారు. గిరిజన ప్రజలు ఎంత సాగు చేస్తే అంత భూమికి పట్టాలు ఇవ్వాలి, అన్యాక్రాంతమైన భూములు పేదలకు తిరిగి ఇవ్వాలని, శివ్వాం దళితుల భూములు వెంటనే వారికి అప్పజెప్పాలని, బడి దేవరకొండ గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

కొమరాడ : జిల్లాలో ఉన్న పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈనెల 19న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గుమడ సంతలో ప్రచార ర్యాలీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ శివ్వాం దళితుల భూములు వెంటనే దళితులకు అప్పజెప్పాలని, దళితులపై దాడి చేసిన పెత్తందాలను అరెస్ట్ చేయాలని ఆయనడిమాండ్ చేశారు. బడి దేవరమ్మ కొండ గ్రానైట్ తవ్వకాలు నిలిపివేయాలని, అక్రమ అనుమతులను రద్దు చేయాలని కోరారు. అలాగే మన్యం ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ప్రసాదు, సుందరరావు, బాబురావు, రెడ్డి శివ న్నాయుడు తదితర గిరిజనులు పాల్గొన్నారు.

గారమ్మ కాలనీ రోడ్డుకు సొంతంగా నిధులు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని గారమ్మ కాలనీ రోడ్డు వర్షాలకు పూర్తిగా అధ్వానంగా తయారైంది. నడవడానికి కూడా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో జనసేన నాయకులు పి. ప్రశాంత్ కుమార్‌తో పాటు మరి కొంతమంది సొంతంగా డబ్బులు పోగు చేసి, గ్రావెల్ వేసి ఆదివారం జెసిబితో దగ్గరుండి పని చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

దళితుల దీక్షకు ఎస్ఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

శివ్వాం దళితులపై దాడికి పాల్పుడిన వారిని శిక్షించాలని, వారి భూ సమస్యలు పరిష్కరించాలని, జిల్లాలో గిరిజన, దళితుల, పేదల భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు దీక్షను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో పెత్తందారులు దళితులపై దాడులు చేస్తుంటే అధికారులు ఏమీ ఎరగనట్టు వ్యవహరించడం దుర్మార్గమని, చట్టాన్ని చేతుల్లో తీసుకుని దాడులు చేస్తున్న వారికి అధికారి యంత్రాంగం మద్దతుగా నిలుస్తుందని అభిప్రాయపడాల్సి ఉందని అన్నారు. ఏళ్ల తరబడి సాగుభూముల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాలు పోరాడుతున్నా తూతూ మంత్రంగా సర్వేలు జరిపి అధికారి యంత్రాంగం పూర్తి చేయకుండా నాన్చుడి ధోరణితో ఉంటుందన్నారు. దీనివల్ల భూ సమస్యలు పెరిగిపోతున్నాయి తప్ప పేదవాళ్లయిన భూమిలేని నిరుపేదలకు సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని, శివ్వాం దళిత కుటుంబాలకు న్యాయం చేసి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భూ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు జిల్లా కమిటీ సభ్యులు హెచ్.సింహాచలం కె.డేవిడ్. కె. శ్రీను జి. చంటి ఎం. రాజేష్ తదితరులు దీక్షలలో పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం గిరిజనుల కల : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణం గిరిజనుల కల అని అది టిడిపి ప్రభుత్వం హయాంలో నెరవేరుతుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ కంబగూడ నుంచి డొంగరికెక్కువ వరకు రూ. 50 లక్షలతో మంజూరైన బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణాలు కేవలం కొబ్బరికాయలు కొట్టడానికే పరిమితమయ్యాయని, ఎక్కడా రోడ్డు నిర్మాణ పనులు జరగలేదని అన్నారు. దీంతో గిరిజనులకు విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు అందుబాటులో లేకుండా పోయాయని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి గ్రామాన్ని పర్యటించేటప్పుడు గిరిజనుల కష్టాలు స్వయంగా చూశానని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండాలనే గిరిజనుల కల సాకారం చేసే దిశగా ప్రత్యేక దృష్టి సారించి ఏజెన్సీలో ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. మూడు నెలల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. రోడ్డు నిర్మాణ పనుల్లో గిరిజనులు తమ వంతు బాధ్యత వహించి పూర్తి సహకారం అందించాలని కోరారు. జోగిపురం, వనకాబడి గ్రామాలకు రోడ్లు వేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణాలు పూర్తయితే గిరిజనులకు డోలి కష్టాలు తీరుతాయని అన్నారు. మరోవైపు ఏజెన్సీ సాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించి వినియోగంలోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని ఆమె చెప్పారు. గిరిజన సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా టిడిపి పాలన సాగిస్తుందన్నారు. గిరిజనులకు ఏ విధమైన కష్టాలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కషి చేస్తానని అన్నారు. కార్యక్రమములో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, బిజెపి నాయకులు నిమ్మక సింహాచలం, ట్రైబల్ రైట్ ఫోరం అధ్యక్షులు రొబ్బ లోవరాజు, టిడిపి సీనియర్ నాయకులు తాడంగి లక్ష్మణరావు, తులాల రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గ్రామ, వార్డు సచివాయాల ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయిప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆ సంఘం జిల్లా యూనియన్ మీటింగ్, నూతన కమిటీ ఎన్నిక జరిగింది. హెల్త్ సెక్రటరీ సమస్యల పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలి, పని భారం తగ్గించాలి సమావేశం ఏకగ్రీవ తీర్మానించింది. బి.రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సాయిప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్య సహాయకులకు విధి విధానాలు గ్రామపంచాయతీ పరిధిలో ఉండే వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకురావాలన్నారు. సచివాలయంలో డిడిఒ అధికారం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పరిధిలోకి తీసుకురావాలన్నారు. బదిలీ చేసే ముందు అందరికీ సీనియార్టీ జాబితా తయారు చేయాలన్నారు. ఎఎన్ఎంలకు అవసరం లేని యాప్‌లను మినహాంచాలని, రాయితీలను వెంటనే ఇవ్వాలన్నారు. యూనిఫాం ఎలివేషన్స్ కిట్ ఇవ్వాలని, పై సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. పై డిమాండ్ల సాధన కోసం ఒక నూతన జిల్లా కమిటీ ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి , సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వేణు, జిల్లా నాయకులు బి.సూరిబాబు వివిధ మండలాల సచివాలయ ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షులుగా బి.రమాదేవి, కార్యదర్శి సిహెచ్ స్వర్ణలత, కోశాధికారి ఎం.ఇందిరా, ఉపాధ్యక్షులుగా ఢిల్లీశ్వరి, సహాయ కార్యదర్శిగా డి.రవణమ్మ పాటు 15 మందితో కూడిన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సాయిప్రసాద్

నిల్వ ఉన్న వరదనీటి వద్ద నిరసన తెలుపుతున్న రాచవీధి మహిళలు

పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న రాచ వీధిలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని, వరద నీటిని కాలువల ద్వారా పంపించే ఏర్పాట్లు చేసేలా చర్యలు చేపట్టాలని, రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆ వీధి మహిళలు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు బి.మణమ్మ, రేవతి, జె.అనసూయ, రాజేశ్వరి, ప్రశాంతి, సుశీల, జి.గౌరి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు నిల్వ ఉన్న నీటి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిత్యం చిన్నపాటి వర్షానికి నరకయాతన పడుతున్న పరిస్థితి నెలకొందని, దీనిపైన జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో తమ బతుకులు దుర్భరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విష జ్వరాలు సోకే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కావున అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి వెంటనే రోడ్డుతో పాటు కాలువలు నిర్మించి నీరు నిల్వ లేకుండా, ప్రజలు అనారోగ్యం పాలవ్వకుండా ఉండాలంటే దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే కాలువ లేకపోవడం వల్ల ఆసుపత్రిలో ఉన్నటు నీరు కూడా రాచవీధి లోపలికి వచ్చి ఇళ్లల్లోకి చేరి అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పట్టించుకోకపోతే ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

అధ్వానంగా శ్మశానవాటిక రహదారులు

ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని రెల్లివీధి, గెడ్డ కాలనీతో పాటు బొడ్లపాడు, కొట్టుగుమ్మడ, తదితర గ్రామాల్లో శ్మశానవాటికల రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల బంధువులు, గ్రామస్తులు మృతదేహాలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు అధ్వానంగా మారడంతో మరి ఇన్ని అవస్థలకు గురికావాల్సి వస్తుందని వాపోతున్నారు. కొట్టుగుమ్మడ బిటి రహదారి నుంచి శ్మశాన వాటికి తరలించే రహదారి చిత్త, చిత్తగా మారింది. రెండేళ్ల కిందట ఇదే గ్రామాన్ని అప్పటి కలెక్టర్ నిశాంత్ కుమార్ శ్మశాన వాటిక సమీపంలో ఉపాధి పనులు పరిశీలించేందుకు వచ్చినప్పుడు ఉపాధి కూలీలంతా శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను వేడుకొన్నారు. ఉపాధి హామీ నిధులతో సీసీ రహదారి నిర్మించాలని అప్పట్లో అధికారులకు ఆదేశించినప్పటికీ ఇక్కడ ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. అలాగే బొడ్లపాడు గ్రామ శ్మశాన వాటిక పంట పొలాల మధ్య ఉన్నందున మృతదేహాలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం పంటలు సీజన్ కావడం వల్ల గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని పంట పొలాల నుంచి శ్మశానవాటికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

బురదమయంగా ఉన్న శ్మశానానికి వెళ్లే రోడ్డు

స్కీమ్‌వర్కర్లను తొలగింపును ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్కీం వర్కర్లను అర్ధాంతరంగా తొలగించడం ఆపాలని, లేనిపక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, గత ప్రభుత్వం ఏదైతే తప్పిదాలు చేసిందో కూటమి ప్రభుత్వం కూడా అదే తప్పిదాలను చేస్తోందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ విమర్శించారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న చిరుద్యోగులైన ఆశా, అంగన్ వాడీ, మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్కావేంజర్స్ తదితర మహిళా స్కీం వర్కర్లపై అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతూకార్మికులను అర్ధాంతరంగా తొలగించే విధానాన్ని ఆపాలని అన్నారు. స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని రమణ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి విజయనగరం జిల్లా కార్యదర్శి బుగత అశోక్, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింహాద్రి దుర్గారావు, ఆర్వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టిన యువత

ప్రజాశక్తి - మక్కువ

యూత్ సండే సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోని ఎర్ర సామంతవలసలో యువత పారిశుధ్య పనులు చేపట్టారు. ఆర్‌సిఎం చర్చి ఫాదర్ పువ్వల జీవన్‌బాబు, యూత్ లీడర్ రాయల అనిరుద్, గ్రామంలోని యువత అంతా కలిసి రోడ్లు, మురుగు కాలువలను, పూడిక తీసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.



ఎర్ర సామంతవలసలో పారిశుధ్య పనులు చేస్తున్న యువత

రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

దుకాణాల్లో రాఖీల సందడి

ప్రజాశక్తి - భామిని

మండలం లోని పలు దుకాణాల్లో రాఖీల అమ్మకాలు సందడి నెలకొంది. ప్రతీ ఏటా రాఖీపౌర్ణమి రోజు అన్న, తమ్ముళ్లుకు రాఖీలు కట్టి, అన్న దమ్ములు తమ జీవితాలకు తోడుగా నిలవాలని, ఈ అన్నదమ్ములు బంధం ఇలాగే జీవితాంతం కొనసాగాలని కోరుకుంటామని భావిస్తుంటారు. తండ్రి తర్వాత తండ్రి అయిన అన్న ఆశీర్వాదాలు తీసుకుంటామని మహిళలు తెలిపారు. ప్రస్తుతం రాఖీల ధరలు పెరిగినా అన్నదమ్ములుకు రాఖీలు కట్టడం మానమని మహిళలు తెలిపారు.

నగరంలో కుండపోత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ చెరువును తలపించాయి. నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోకి నీరు అధికంగా చేరి చెరువులా మారింది. భారీగా నీరు చేరడంతో కార్యాలయం బయట ఉన్న వాహనాలు నీటిలో మునిగిపోయాయి. నగరంలో రోడ్లు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు భారీగా చేరింది. కాలువల వ్యవస్థ డొల్లతనం ఈ వర్షానికి బయట పడింది.